క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ధరూరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు వార్డెన్ నర్సింహులు తెలిపారు. శనివారం సాయంత్రం ధరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ ఆనందయ్య, వైద్య సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంఈఓ రవీంద్రబాబు యూనిఫాం, సబ్బులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలి



మల్దకల్: మండల పరిధిలోని బిజ్వారం పశు వైద్య కేంద్రానికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పశువైద్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సరైన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహన నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో చోరీ



ఎర్రవల్లి: మండల కేంద్రంలోని షేకుపల్లి రోడ్డులోని శ్రీవీరభద్రేశ్వర సూపర్ మార్కెట్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఐరన్ రేక్ బోల్టాలు తొలగించి దొంగ ప్రవేశించినట్లు సీసీ ఫుటేజ్‌లో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రూ. 20 వేల నగదు అపహరించినట్లు బాధితుడు పేర్కొన్నారు. బాధితుడు పరమేశ్వరయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ పేర్కొన్నారు.

గిజిగాడి గూడు.. రెండు గదుల పొదరిల్లు



పానగల్: గూడు నిర్మాణంలో గిజిగాడికి సాటిరారెవరు. గూడులో అమరికలో గిజిగాడు ప్రదర్శించే కళాత్మకత, నైపుణ్యం నేర్పరితనం కంప్యూటర్ యుగంలో మానవుడికి సాధ్యం కానిది అంటే అతిశయోక్తి కాదు. మండలంలోని పలు గ్రామాల్లో వీటి గూళ్లు చెరువులోకి, కాల్వలోకి, బావుల్లోకి వంగిన తుమ్మ చెట్టు కొమ్మలకు, తాటి, ఈతచెట్లకు వేలాడుతూ ఆకట్టుకుంటున్నాయి. కొమ్మలకు వేలాడుతున్న గిజిగాడు గూడులు అందరిని మైమరిపిస్తుంటాయి. పాన్‌గల్, దావాజిపల్లి సమీపంలో తుమ్మ చెట్లకు గిజిగాడు అల్లిన రెండు గదుల గూళ్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

మంగళాభట్‌కు ఘన నివాళి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దివంగత కథక్ నృత్య కళాకారిణి మంగళాభట్‌కు శనివారం జిల్లా కేంద్రంలో నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో సంఘం బాలరాజు, వేణుగోపాల్, రాములు, నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొర్తవరి వైపు రైతన్న మొగ్గు

- వరి స్థానంలో గొర్తవరి సాగుకు సుముఖత
- పెట్టుబడుల ఖర్చు తగ్గించుకునే దిశగా
- సాధారణ వరితో పోలిస్తే తగ్గనున్న ఆర్థిక భారం



మాన్‌దొడ్డిలో సాగు అవుతున్న గొర్తవరి పంట

రాజోళి: మండల పరిధిలో గొర్తవరి సాగుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. సాధారణ వరి పంటను సాగులో నష్టాలు చవి చూడటంతో దాని స్థానంలో గొర్తవరి పంటను వేసి ధాన్యం పండించేందుకు ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో మండలంలో ఈ ఏడాది వరిపంట స్థానంలో గొర్తువరి సాగు బాగా పెరిగింది.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

మండల పరిధిలో దాదాపు 2000 ఎకరాల్లో వరిపంట సాగు చేపడుతారు. ఈ ఏడాది ప్రస్తుతానికి సుమారు 500 ఎకరాల్లో గొర్తవరి సాగుకు సిద్ధమవుతున్నారు. గతంలో గొర్తవరి అడపాదడపా సాగు చేస్తున్నప్పటికీ ఈ ఏడాది విస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని తుంగభద్ర నదీ తీరంలోని రాజోళి, మాన్‌దొడ్డి, పచ్చర్ల, తూర్పుగార్లపాడు, పడమటి గార్లపాడు, పెద్దధన్వాడ, చిన్నధన్వాడ తదిదర గ్రామాల్లో ఇప్పటికే గొర్తవరి పంటను సాగు చేస్తున్నారు. మరి కొందరు విత్తనాలు వేసేందుకు సమాయత్తమయ్యారు.

పెట్టుబడుల భారంతో

సాధారణ వరి పంటను సాగుకు ఏడాదికేడాది పెట్టుబడి భారమవుతుందని రైతులు వాపోతున్నారు. అదే విధంగా కూలీల సమస్య కూడా వేధిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గొర్తవరి సాగు చేస్తే తక్కువ ఖర్చుతో వరి సాగు చేస్తున్నారు. సాధారణ వరిసాగుకు ఎకరా విస్తీర్ణంలో నాట్లు వేసేందుకు, కేవలం కూలీలకు రూ.8 వేల ఖర్చు అవుతుండగా..ట్రాక్టర్ బాడుగలు, ఇతర సేద్యం ఖర్చులకు ఎకరాకు రూ.25 వేలు, నారు పోసుకునేందుకు, ఇతర పెట్టుబడులకు రూ.15 వేలు ఖర్చు వస్తున్నట్లు పేర్కొంటున్నారు.

తప్పనున్న కూలీల సమస్య

గొర్తువరి సాగులో నారుపోసి, నాట్లు వేసుకునే అవసరం లేకుండా నేరుగా విత్తనం వేయవచ్చు. కూలీల అవసరం లేకుండా రైతులే స్వయంగా చేసుకోవచ్చు. విత్తనం వేశాక నారు ఆరు ఇంచుల వరకు పెరిగిన సమయంలో పొలంలో నీరు ఉన్నా కూడా కలుపు తీసుకునే అవకాశం గొర్తవరి సాగులో ఉంటుంది. అదే సాధారణ వరిలో కలుపునకు ఇతర పనులకు విభిన్నంగా ఉండటంతో పాటు ఇబ్బందికరంగా ఉంటుంది. దీంతో తక్కువ ఖర్చులో గొర్తవరి పంటను సాగుకు చేపట్టవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

కూలీల సమస్య తట్టుకోలేక



వరిసాగులో ప్రధానంగా నాట్లు వేసేందుకే ఎకరాకు రూ.8,000 ఖర్చు అవుతుంది. కూలీలు సమయానికి రాని పక్షంలో నాట్లు వేయడంలో ఆలస్యం అవుతుంది. తెచ్చుకున్న నారు వృథా అవుతుంది. గొర్తు వరిలో ఆ సమస్య లేదు.

- కరుణాకర్‌గౌడ్, మాన్‌దొడ్డి

నాలుగు ఎకరాలల్లో సాగు



నాలుగు ఎకరాలల్లో గొర్తువరి సాగు చేపట్టాను. కూలీలతో పని లేకుండా కుటుంబ సభ్యుల సహకారంతో విత్తనాలు వేసుకున్నాం. కలుపు తీసే సమయంలో కూడా ఇబ్బంది ఉండదు.

- నర్సింహ, మాన్‌దొడ్డి

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

మండల పరిధిలో ఈ ఏడాది రైతులు గొర్తువరి వైపు మొగ్గు చూపుతున్నారు. నీటి ప్రాధాన్యత, కూలీలు, కలుపు తదిదర అంశాల్లో ఇబ్బంది లేకుండా ఉంటుంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది మండలంలో గొర్తువరి సాగు విస్తీర్ణం పెరిగింది. రైతులు అధికారుల సలహాలు తీసుకోవాలి.

- సురేఖ, మండల వ్యవసాయ అధికారి

మరమ్మతు చేయండి సారూ..



ఇటిక్యాల సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఇటిక్యాల: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు పడి నానా అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు గుంతల వల్ల అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాత్రుళ్లు ప్రయాణించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు మరమ్మతు చేపట్టాలన్ని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే రోడ్డు సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చేపపిల్లల పెంపకానికి సీడ్ ఫాంలు నిర్మిస్తాం



రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ నిఖిలకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా మత్స్యకార సంఘం ప్రతినిధులు

దేవరకద్ర: జిల్లాలో చేపపిల్లల కొరత లేకుండా ఉత్పత్తి పెంచడానికి కావాల్సిన కొత్త సీడ్ ఫాంలను నిర్మిస్తామని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ నిఖిల అన్నారు. శనివారం ఆమె కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సందర్శించి చేపపిల్లల పెంపకం కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు, అధికారులతో ఆమె మాట్లాడారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన సీడ్ ఫాంలు శిథిలావస్థకు చేరాయని, వాటిని మరమ్మతు చేయడానికి, అవసరమైతే కొత్త సీడ్ ఫాంల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా మొత్తం అవసరమైన చేపపిల్లల పెంపకానికి ఉపయోగపడే విధంగా కొత్త ఫాంలను నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ గంజి ఆంజనేయులు మత్స్యకారుల సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. గత రెండేళ్లలో మత్స్యశాఖలో శిక్షణ పొంది ఉత్తీర్ణులైన వారికి సంఘం సభ్యత్వాలు వెంటనే ఇవ్వాలని, జిల్లా మత్స్యశాఖ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ రాధారోహిణి, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ వెంకట్రాములు, నాయకులు వర్మ, అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూరాల ఆనకట్టపై వెలగని వీధిలైట్లు



జూరాల ఆనకట్ట ఎడమవైపు దిమ్మెకూలి కిందకు పడిన స్తంభం

అమరచింత: ఉమ్మడి జిల్లాకే వరప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన వీధిలైట్లు కేవలం నిలువు స్తంభాలుగానే పరిమితమయ్యాయని, రాత్రివేలలో వెలుగులు చిమ్మడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టుపై గత ఐదేళ్లుగా రాత్రి సమయంలో బల్బులు వెలగకపోతున్న అధికారులు మాత్రం సమస్యలను దాటేస్తున్నారు. ప్రతి సంవత్సరం మెంటేనెన్స్ ద్వారా నిధులు వస్తున్న జూరాల ఆనకట్టపై వీధి లైట్లు ఏర్పాటు చెయ్యలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వంతెనపై ఉన్న లైటింగ్ స్థలాలు దిమ్మెలు కూలికింద పడిన వాటివైపు కన్నెత్తి చూడలేకపోతున్నారు. ఎగువ నుంచి వరదనీరు వస్తుండటంతో ప్రాజెక్టు సందర్శనార్థం పర్యాటకులు వస్తుంటారని ప్రాజెక్టు ఆనకట్టపై లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మండల కేంద్రంలోని బీసీ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన పార్టీ మండల మహాసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో సీపీఐ ఉద్యమాలను బలోపేతం చేసి పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. మూడేళ్లకు ఒకసారి జరిగే మండల మహాసభలో మూడేళ్ల కాలంలో పార్టీ చేసిన కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన 12సంవత్సరాల కాలంలో మైనార్టీలకు, దళితులకు బీసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేట్‌పరం చేసి బీజేపీ ప్రభుత్వం విదేశీ కార్పొరేట్లకు అమ్ముడు పోయిందని ఆరోపించారు. కార్మికుల కర్షకులకు కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ సీపీఐ కార్యదర్శులు అబ్రహం, రవీందర్, శ్రీహరి, గోపాలకృష్ణ, రమేష్, భాస్కర్, కుతుబ్‌లతో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం



ఎర్రవల్లి: మండల కేంద్రంలో శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జి కుసుమకుమార్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. జోగుళాంబ ఆలయ దర్శనానికి వెళ్తుండగా పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి కూడలిలో పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జోగుళాంబ ఆలయ కమిటీ డైరెక్టర్ జోగుల సరస్వతి, నాయకులు జోగులరవి, కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, రుక్మాందర్‌రెడ్డి, వేముల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌సీ ఒలింపియాడ్ 6.0 ప్రారంభం

కేటీదొడ్డి: వెనుక బడిన గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి, డిజిటల్ అక్షరాస్యత అవకాశాలు కల్పించే దిశగా సీఎస్‌సీ ఒలంపియాడ్ 6.0 ప్రారంభైనట్లు సీఎస్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3 నుంచి 12వ తరగతి విద్యార్థుల్లో సైన్స్, గణితం, ఇంగ్లిష్ సైబర్ విషయాల్లో ప్రతిభను గుర్తించి మెరుగుపరచాలనే లక్ష్యంతో రూపొందించబడిందని 6వ ఒలంపియాడ్‌లో గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యార్థులు సీఎస్‌సీ కేంద్రం లేదా పాఠశాల ఆధారిత సీఎస్‌సీ కియోస్క్ ద్వారా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు అధికారక వెబ్‌సైట్‌ను పరిశీలించగలరని సూచించారు.

నేడు మంత్రి 'వాకిటి' రాక

అమరచింత: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఆదివారం మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి రానున్నట్లు ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.50 లక్షలతో నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం, సింగంపేటలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తారని ఉదయం 8 గంటలకు మంత్రి అమరచింతకు రానున్నట్లు పేర్కొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా అబ్రహం

అమరచింత: సీపీఐ మండల కార్యదర్శిగా అబ్రహంను ఎన్నుకున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి రవీందర్ తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో సహాయ కార్యదర్శిగా భాస్కర్, కమిటీ సభ్యులుగా శ్యాంసుందర్, రవీందర్, గీతమ్మ, లక్ష్మీనారాయణ, కుతుబ్, శ్రీనివాస్‌రెడ్డి, అంజి, రవి, కురుమన్న, అలివేలమ్మ, ఆనంద్‌ను ఎన్నుకున్నామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని అబ్రహం పేర్కొన్నారు.

కేంద్రంపై పోరాటం చేయాలి



ఎర్రవల్లిలో మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు



అయిజలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ కోఆర్డినేటర్ పల్లయ్య

ఎర్రవల్లి: కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో బిల్లు తీసుకొచ్చేందుకు కేంద్రంపై పోరాటం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల పెంపుతో బీసీలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపు నిర్ణయం తీసుకుందని విమర్శలు చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్ల పెంపు వల్ల బీసీ సమాజం తమ నాయకులను పార్లమెంట్, అసెంబ్లీలోకి ప్రజాప్రతినిధులను ఎన్నుకోలేరన్నారు. 42 శాతం రిజర్వేషన్ల పెంపు ద్వారా ఎన్నికయ్యే పదవులు కలెక్టర్ తొలగిస్తే పోయే పదవులని తెలిపారు. అధికారులు తొలగిస్తే పోయే పదవుల వల్ల బీసీ సమాజానికి ఏ విధంగా న్యాయం జరుగుతుందో రాష్ట్ర ప్రభుత్వం వివరించాలన్నారు. బీసీల అభివృద్ధిపై న్యాయబద్ధంగా రావాల్సిన వాటాపై ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తుందన్నారు. బీసీ సమాజంపై ప్రభుత్వం కపట ప్రేమను చూపిస్తూ.. వారిని నష్టపరిచే విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, సవారన్న, రాముడు, బుచ్చన్న, భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం

అయిజ: కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను తీవ్రమైన మోసం చేస్తున్నారని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్వీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి ఆర్డినెన్స్ తెస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి ఇష్టం లేకనే ఇలాంటి ఎత్తుగడలు వేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు కృష్ణ, రాజు, తిమ్మప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలాక్షేత్రం



పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, వాల్మీకి పూజారులు తిమ్మప్ప, నర్సింహులు, ఆలయ సిబ్బంది ఉరుకుంద, కృష్ణ, శివమ్మ, రాము, శ్రీను, చక్రి పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో పశువుల సంచారం



ప్రహరీ లేక పాఠశాల ఆవరణలో సంచరిస్తున్న పశువులు

మల్దకల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఆవరణలో పశువులు, పందులు, సంచరిస్తున్నాయన్నారు. దీంతో అపరిశుభ్రంగా ఆవరణ మారుతుందన్నారు. అధికారులు స్పందించి ప్రహరీ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత ముఖ్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకుంటున్న సంఘటనలు ఎక్కువయ్యాయని, వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్‌బీఐ మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ రామమూర్తి అన్నారు. శనివారం నగరంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో బ్రాంచి మేనేజర్లతో కలిసి ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ప్రతిరోజు కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కొందరికి మీ బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్‌కార్డు లింక్ లేదు.. ఇక్కడ ఇచ్చిన లింక్‌లో మీ బ్యాంకు అకౌంట్ వివరాలు పొందుపరచాలని లింకులు పంపుతున్నారని, వీటిని క్లిక్ చేసి వివరాలు ఇస్తే, బ్యాంకు ఖాతా ఖాళీ చేస్తున్నారన్నారు. కొందరికి మీ ఖాళీ స్థలంలో సెల్ టవర్ పెట్టి మీకు ప్రతినెలా కిరాయి చెల్లిస్తాం, యువతకు, గృహిణులకు మీకు ఆన్‌లైన్‌లో పనిచేసే ఉద్యోగం, మీ పిల్లలకు ప్రమాదం జరిగి ఆస్పత్రిలో ఉన్నారని, వారి చికిత్స కోసం డబ్బు పంపమని లేదా పిల్లలు గంజాయి తీసుకున్న కేసులో అరెస్టు అయ్యారని, విడిపించడానికి డబ్బులు పంపమని మోసం చేస్తున్నటువంటి సంఘటనలను సోదాహరణంగా వివరించారు. కొందరికి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టమని నకిలీ యాప్‌లు పంపి రూ.కోట్లు హరిస్తున్నారని వివరించారు. ఇలాంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ పొరపాటున మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సైబర్ నేరం వివరాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ కార్యాలయ సిబ్బంది నళిని, బాలసుబ్రమణ్యం, జగన్, భూషణ్, ప్రవీణ్, ఆయా బ్రాంచి మేనేజర్లు భాస్కర్, అల్తాఫ్, మోహన్, వీవీడీఎస్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సభ్యులు ప్రభావతి, నరేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న, మేనేజర్ రామమూర్తి

అధునాతన సైన్స్ ల్యాబ్ అవసరం



సైన్స్ ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో అధునాతనమైన సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నగరంలోని సద్దలగుండు ప్రాంతంలో నెలకొల్పిన కలాం డ్రీమ్ ఫోర్స్ సైన్స్ ల్యాబ్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న సైన్స్ అధ్యాపకులు చర్చించి ఈ ప్రయోగశాల ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర నివేదిక ఇస్తే అవసరమైన నిధులు సమకూరుస్తామన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం రైల్వేస్టేషన్ సమీపంలోని టాస్క్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడి విద్యార్థులతో శిక్షణపై అడిగి తెలుసుకున్నారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు క్యాంప్ కార్యాలయంలో ఆయనను జమాతే ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో మహిళలు కలిశారు. త్వరలోనే వీరన్నపేటలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించనున్నామన్నారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. కాగా, మహబూబ్‌నగర్ విద్యానిధికి మున్నూరు కాపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు రూ.12,600 చెక్కు ఎమ్మెల్యేకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కలాం డ్రీమ్ ఫౌండేషన్ సభ్యులు శ్రీధర్, జనార్దన్, రవీందర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, వెంకటేశ్వరమ్మ, టాస్క్ సిబ్బంది సతీష్‌కుమార్, నాయకులు అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.